

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

సోమవారం 09 మార్చి 2026 పేజీలు : 04


# లోపం అధికారులదా..లేక పాలకులదా..!

- సిబ్బంది కొరతంటున్న మునిసిపల్ అధికారులు...
- డ్రైనేజీ వ్యర్థాలు ఎత్తిన కూటమి నాయకులు...!
- ప్రజలకు జవాబుదారి ఎవరు... సమస్యలు తీర్చేదెవరు...?





వీధుల్లో పెరిగిపోయిన చెత్త





**ధర్మవరం,మార్చి8,ప్రభాతవార్త**

కూటమి పార్టీ ఏర్పాటై 22నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ పరిపాలనలో వారి లోపాలు కొట్టొచ్చినట్టు కనపడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో కూటమిలోని మూడు పార్టీలనాయకులు, మూడుపార్టీల వార్డు ఇంచార్జిలు మురుగు కాలవల వద్ద పారిశుధ్య కార్మికులు మట్టివ్యర్థాలను తీసే చోట ఫోటోలకు ఫోజులు ఇస్తున్నారే తప్ప... ఆ మట్టి తరలింపు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించలేకపోతున్నారు. ఎందుకంటే మున్సిపల్ సిబ్బంది చెప్పే "సిబ్బంది లేరు" అనే సమాధానంతో ఎవరికి చెప్పినా సమస్య పరిష్కారం కాదన్నట్టు మిన్నకుండిపోతున్నారు. డ్రైనేజీ వ్యర్థాలను ట్రాక్టర్ కు ఎత్తిన కూటమి నాయకులు...! పట్టణంలోని 24వ వార్డులో డ్రైనేజీ వ్యర్థాలను తరలించడంలో మున్సిపల్అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని. గత ఆరునెలలుగా డ్రైనేజీలలోని చెత్తాచెదారం, వ్యర్థాలను తీసి అక్కడే వేస్తూ వచ్చారని. దీంతో చెత్తాచెదారం, వ్యర్థాల ద్వారా వచ్చే దుర్వాసనతో భరించలేక పోతున్నామని పలుమార్లు మున్సిపల్ అదికారులకు పిర్యాదు చేశామని. ఇంతకు మునుపు ముగ్గురు కమిషనర్లకు తెలిపినా కూడా ప్రయోజనం లేకుండా పోయిందని. ప్రస్తుతం నాలుగో కమిషనర్ కు తెలిపినా ప్రయోజనం లేదన్నారు స్థానికులు. పిర్యాదు చేసినప్పుడు మాత్రం వస్తారు.. చూస్తారు.. వెళ్తారన్నారని అదీ లేదంటే వ్యర్థాలను తరలించడానికి ఆ వీధుల్లోకి ట్రాక్టర్ రాదని సాకు చెబుతారన్నారని స్థానికులు కూటమిపాటి నాయకులకు ఫిర్యాదు చేశారు. దీంతో చేసేది లేక కూటమిలో ఓ పార్టీ నాయకులు చెత్తాచెదారం, వ్యర్థాలను ట్రాక్టర్లకి వేసి అక్కడి నుండి ఆ వ్యర్థాలను తరలించారు. మున్సిపాలిటీలో సమస్యలు అధికం...! మున్సిపాలిటీలో చాలా చోట్ల మున్సిపల్ వ్యర్థాలు, పట్టణ ప్రజలు వేసే చెత్తను తరలించే విషయంలో మున్సిపల్ సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నది స్పష్టం గా కనబడుతోంది. సిబ్బంది కొరత తక్కువగా ఉన్నప్పటికీ ఆ సాగు చెప్పి పనులు ఎక్కడికక్కడ జరగకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నది కూటమి పార్టీ నాయకులే బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారు. అయితే కూటమిలోని మూడు పార్టీల నాయకులు మున్సిపాలిటీలోని వార్డులలో పర్యటిస్తూ మునిసిపల్ సిబ్బంది తమకు స్పందించడం లేదని, తమ మాట వినడం లేదని బహిరంగంగా ప్రజలకు చెబుతూనే వారి పరిపాలన లోని లోపాన్ని ప్రజలకు తెలియపరుస్తున్నారని చెప్పవచ్చు. మున్సిపల్ అధికారులకు దృష్టికి వార్డులలోని సమస్యలు ఎన్నిసార్లు తీసుకువెళ్లినా పరిష్కారం చేయడం లేదని వాపోతున్నారు కూటమి పార్టీల నాయకులు. మున్సిపల్ యంత్రాంగం అధికార పార్టీ నాయకుల మాట వినడం లేదంటే లోపం అధికారులలో ఉన్నట్టా.... లేక పాలకులలో ఉన్నట్టా...అని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే వేసవికాలం ప్రారంభ దశలో ఉండగా పట్టణంలోని శివారు ప్రాంతాలైన కేతిరెడ్డి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, పోతుల నాగేపల్లి కాలనీ వంటి ప్రాంతాలలో ఇప్పటికే నీటి కొరత అధికంగా ఉంది. గత ప్రభుత్వ హాయంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో జలజీవన్ పథకం ద్వారా నిర్మాణం ప్రారంభించిన ఓవర్ హెడ్ ట్యాంకు పనులు సాగకపోగా ఎక్కడి కక్కడ నిలిచిపోయాయి. ఇప్పటికే ఆ కాలనీలలో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి మురుగు కాలవలో మట్టి తీసే పనులే సక్రమంగా నిర్వర్తించని మునిసిపల్ అధికారులు ఆ కాలనీ ప్రజల నీటి కష్టాలు ఎలా తీరుస్తారో పాలకులు ఒకసారి ఆలోచించాలి. కేతిరెడ్డి కాలనీలో నిర్మాణం ప్రారంభించిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు ఒకవేళ పూర్తి అయినప్పటికీ రైల్వే ట్రాక్ ఎడమవైపు ఉన్న ప్రాంతానికి నీటి సరఫరా పైపులైను పనులు చేయాలంటే రైల్వే అధికారుల అనుమతి కావాల్సి ఉంటుందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. మరి ధర్మవరం నియోజకవర్గ శాసన సభ్యులుగా ఎన్నికైన మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వ అధికారులతో చర్చించి ఆ కాలనీ ప్రజల దాహార్తి తీర్చాల్సిన భాధ్యత, అవసరం ఎంతైనా ఉంది. కూటమి పార్టీ గెలుపును తమ భుజస్కందాలపై వేసుకుని స్థానిక శాసనసభ్యుడు గెలుపు కోసం పనిచేశామని చెప్పుకునే మరికొన్ని పార్టీల నాయకులు కూడా ప్రజల సమస్యలు పట్టనట్టు వ్యవహరించడం చాలా బాధాకరం అని కాలనీల ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు చెప్పినట్టు నిజంగా సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వారు చేయాల్సిన చిన్నపాటి పనులకు కూడా కుంటి సాకులు చెబుతూ పనులు చేయకుండా నానబెట్టడం పట్టణ ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తోంది. ధర్మవరం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వెనుక ప్రాంతంలో చెత్త తరలింపు నిర్వహించకపోవడంతో రోడ్డు కూడా పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు మునిసిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి కొంతమంది మునిసిపాలిటీలో సిబ్బంది కొరతే ఉంటే లీజు పద్ధతిలో ట్రాక్టర్లను ఎందుకు తిప్పుతున్నట్టు, వాటి కాంట్రాక్టర్లకు లక్షలబిల్లులు ఎందుకు చెల్లిస్తున్నట్టు అర్థం కావడం లేదని కొందరు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. చెత్తను తరలించాలన్నా, డ్రైనేజీలో వ్యర్థాలను తీయాలన్నా పాలకుల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా సమస్యలు అధికంగా ఉన్నాయని అక్కడ కూడా యంత్రాలు ఉన్న పనిచేసే సిబ్బంది కొరత ఉందని ఆసుపత్రి యాజమాన్యం బహిరంగంగానే చెబుతున్నారు. సౌకర్యాలు మరింత మెరుగుపరిచి ప్రజలకు సేవలు అందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీలోనే ఇన్ని సమస్యలు ఉంటే కూటమిలోని మూడుపార్టీల నాయకులు ప్రభుత్వ సిబ్బందితో పని చేయించలేకపోతున్నారు. అంటే లోపం అధికారులలో ఉందా... లేక పాలకులలో ఉందా... అని పట్టణ ప్రజలు చర్చించు కుంటున్నారు. ఇప్పటికైనా కూటమిలోని మూడు పార్టీల నాయకులు ప్రజల సమస్యలు పట్టణంలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపరచడంలో దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


పూర్తికానీ నీటి ట్యాంక్ పనులు

# పండుగ వాతావరణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలి - బాల్యవివాహాల నివారణకు సమిష్టి కృషి అవసరం
- మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి - ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు





మహిళలతో కలిసి మహిళా దినోత్సవ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు, చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, మార్చి 8 ప్రభాతవార్త**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గంలో ఆదివారం పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం ప్రజావేదికలో నిర్వహించిన వేడుకల్లో మహిళా నేతలు, అధికారులు, తెలుగు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ మహిళలు విద్యావంతులై సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ రాష్ట్రం, దేశ అభివృద్ధికి భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒక మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పలు ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోడ్పాటుతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలను పూర్తిగా వినియోగించుకునే అవకాశాలు కల్పించలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని పలు చర్యలు చేపట్టిందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాల ద్వారా మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అన్నారు. కళ్యాణదుర్గం నియోజక వర్గంలో ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా రూ.212 కోట్ల రుణాలు మహిళా సంఘాలకు అందించామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు ఉన్నతి పథకం కింద రూ.2.39 కోట్ల మెగా చెక్కును, మహిళా సంఘాలకు రూ.40.06 లక్షల రుణాల చెక్కులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సంఘాల మహిళలతో కలిసి అందజేశారు. మహిళలు ఇప్పటికే అనేక రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని, కళ్యాణదుర్గం ప్రాంతంలో కూడా మరింత మంది మహిళా వ్యాపార వేత్తలను తయారు చేయడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లాలో ముఖ్యంగా కళ్యాణదుర్గం ప్రాంతంలో బాల్యవివాహాలు ఎక్కువగాజరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు అధికారులు, ప్రజాప్రతి నిధులు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన అంగన్వాడీ కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. మినీ అంగన్వాడీ సిబ్బందికి కార్యకర్తలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను అందజేశారు. అలాగే మహిళా దినోత్సవం సందర్భంగా హాజరైన మహిళలకు చీరలు అందజేసి ఎమ్మెల్యే గౌరవించారు. ఈ కార్యక్రమంలో వసంతబాబు, సీడీపీఓ ప్రసన్నలక్ష్మి, మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ల లక్ష్మీదేవి, మున్సిపల్ చైర్మన్ తలారి గౌతమి, సర్పంచులు గీతాంజలి, కృష్ణవేణి, బ్రహ్మసముద్రం జెడ్పీటీసీ ప్రభావతి, అక్కమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పద్మావతి, మాజీ ఎంపీపీలు దీనమ్మ, మానస, కౌన్సిలర్లు అచ్చువల్లి అనిత, రాధికా రాణి పాల్గొన్నారు.


మినీ అంగన్వాడీ కార్యకర్తలకు పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న దృశ్యం

# మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి

- ప్రతి రంగంలో మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే చంద్రబాబు లక్ష్యం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్


మహిళలను దుశ్శాలువాతో సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


మహిళలకు శ్రీనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

**కదిరి, మార్చి 8 ప్రభాతవార్త**

నేటి మహిళలు సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో ముందుకు రావడమే సమాజ పురోగతికి పునాది అని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం కదిరి, మదనపల్లి రహదారిలోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. చదువు మనిషి జీవితాన్ని మార్చగల శక్తి అన్నారు. విద్యలేనివారు ప్రపంచంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేరని, ప్రతి కుటుంబం పిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైనా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్రమోదీ ఆలోచన విధానం ఆదర్శ ప్రాయమన్నారు. నరేంద్రమోదీ గతంలో ప్రధాన మంత్రి అయినా తల్లి ఇంటికి వెళ్లి పరామర్శించే తీరు తెన్నులు ఆదర్శంగా నిలిచాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళా సాధికారతతోనే ఆర్థికంగా ఎదగడానికి ఎంతో కృషి చేశారన్నారు. మహిళలను పరాన్న జీవులుగా చిత్రీకరించే వారిని, మగవారికంటే తక్కువ ఏమీ కాదు, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్థి హక్కుతో రాజకీయ రంగంలో అవకాశం కల్పించి టిడిపికి మహిళల పట్ల ఉన్న గౌరవాన్ని చాటి చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం అమలు చేస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మహిళల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉన్నారన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరుగుతోందని, ఈ పథకం మంచిదా కాదా అని మహిళలను ప్రశ్నించగా మహిళలు గట్టిగా కేకలు వేస్తూ హర్షం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అందరికీ ఒక్కొక్కరికీ రూ.13వేలచొప్పున తల్లుల ఖాతాల్లో జమా చేశారన్నారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలకు జీతాలు పెంచడంతోపాటు పదోన్నతులు కల్పించడం జరిగిందన్నారు. మహిళలు ఓర్పు, సహనం, ఎక్కువని మహిళలు ఎప్పుడు తన కుటుంబం బాగుపడాలని ఆలోచిస్తారని తెలిపారు. అనంతరం స్త్రీ నిధి కింద నియోజకవర్గంలోని 1102 మహిళా సంఘాలకు రూ.38.55 కోట్ల చెక్కును ఎమ్మెల్యే కందికుంట చేతులు మీదుగా మహిళా సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. సమావేశంలో మహిళలకు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వివిఎస్ శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా భాహుద్దీన్, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, స్వచ్ఛాంధ్ర మిషన్ కమిషనర్ పర్వీన్‌భాను, మెప్మా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, టిడిపి నాయకులు, ఏపిఎంలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# విమానాలు నడుపుతున్నాం.. ఐఏఎస్‌లుగా రాణిస్తున్నాం

- రాప్తాడులో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం- 4107సంఘాలకు రూ.284.53 కోట్ల రుణాల మెగా చెక్కు అందజేత
- కొడుకులు రాకపోతే కూతుళ్లే అంత్యక్రియలు చేస్తున్నారు - ఇంకా ఎందుకు మహిళలపై వివక్ష.. పరిటాల సునీత ప్రశ్న





మెగా చెక్కును అందజేస్తున్న దృశ్యం, మహిళలకు సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే సునీత, తదితరులు

**రాప్తాడు, మార్చి 8 ప్రభాతవార్త**


మహిళలు విమానాలు నడుపుతున్నారు.. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా రాణిస్తున్నారు.. అయినా నేటికీ ఆడపిల్ల అంటే నిర్లక్ష్యం, వివక్ష సమాజంలో కనిపిం చడం బాధాకర మని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గస్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. ఎమ్మెల్యే సునీతకు స్థానిక నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున

మిగతా 4లో...

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్



మహిళా దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మెగా చెక్కును అందిస్తున్న జిల్లా కలెక్టర్

**శ్రీ సత్య సాయి జిల్లా, మార్చి 08, ప్రభాతవార్త ప్రతినిధి**

ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం2026 పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం డి ఆర్ డి ఏ, ఐసిడిఎస్, మెప్మా ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని ఎస్ జి కన్వెన్షన్ నందు జిల్లా స్థాయి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ముందడుగు వేయడం శుభపరిణామమని కొనియాడారు. వేదికపై ఉన్న మహిళా అధికారులే ఇందుకు నిదర్శనమని పేర్కొంటూ, ప్రతి మహిళా ఆర్థికంగా ఎదిగి ఒక వ్యాపారవేత్తగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. హిందూపూర్ ఖఅభిజాన్ నృత్యాలయ్ఖ, ధర్మవరం ఖశ్రీ లలితా నాట్య కళా కేంద్రంఖ వారి నృత్య ప్రదర్శనలు మరియు లేపాక్షి జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు ప్రదర్శించిన ఖబాల్య వివాహాలఖపై చైతన్య నాటిక అందరినీ ఆలోచింపజేశాయి. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను కలెక్టర్ సందర్శించి, మహిళల నైపుణ్యాలను అభినందించారు. మహిళా సంఘాల అభ్యున్నతి కోసం డి ఆర్ డి ఏ వెలుగు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో రుణాల పంపిణీ జరిగింది. జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ రూ. 1687.64 కోట్ల భారీ మెగా చెక్కును మహిళా వ్యాపారవేత్తలకు పంపిణీ చేసి సన్మానించారు. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి సిఐఎఫ్ రుణాల రూపంలో మొత్తం రూ. 1687.64 కోట్లను, అలాగే పి ఎం ఏ జె ఏ వై ఉన్నతి కింద రూ. 1.94 కోట్లను కలెక్టర్ మహిళా సంఘాలకు అందజేశారు. 12 యూనిట్ల ఎగ్ కార్ట్స్ (ఒక్కొక్కటి రూ. 50 వేల విలువైనవి) ఉచితంగా అందజేశారు. సబ్సిడీపై 10 కుట్టు మిషన్లను, రైతు సేవా కేంద్రం ద్వారా చిలమత్తూరు ఎస్పీఓ లకు రూ. 15 లక్షల విలువైన ట్రాక్టర్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అకితా సురాన, ఆర్ డి టి డైరెక్టర్ విశాల ఫెర్రర్, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య, పుట్టపర్తి ఆర్ డి ఓ సువర్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, 32 మండలాల నుండి సుమారు 1200 మంది మహిళా వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. చివరగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఖస్టార్ మహిళలనుఖ, మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.

# మహిళా అభివృద్ధికి కృషి చేసిన ఘనత వైఎస్.జగన్‌దే..!

- వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీదేవి - వైసిపి కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**అనంతపురం సిటీ, మార్చి 8 ప్రభాతవార్త**

మహిళా అభివృద్ధికి కృషి చేసిన ఘనత మాజీ సీఎం, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి కొనియాడారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైసిపి జిల్లా కార్యాలయంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, వైస్ చైర్మన్ నాగరత్నమ్మలతోపాటు మహిళా నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేట్ కటింగ్ నిర్వహించి మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ.. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అన్నారు. ముఖ్యమంత్రిగా ఐదేళ్ల కాలంలో మహిళా సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. డిప్యూటీ సీఎం పదవి నుంచి నామినేటెడ్ పదవి వరకు మహిళలకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చారని కొనియాడారు. జడ్పి చైర్మన్ బోయ గిరిమ్మ మాట్లాడుతూ.. మహాత్మాజ్యోతిరావు పూలే కలలుకన్న మహిళా సాధికారతను సీఎంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. చట్ట సభల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించాలన్న సంకల్పంతో అత్యధిక పదవులను మహిళలకే కేటాయించారని పేర్కొన్నారు. కూటమి పాలనలో మహిళా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, గుత్తి మున్సిపల్ వైస్ చైర్మన్ వరలక్ష్మి, సర్పంచు కమలమ్మ, కార్పోరేటర్లు చంద్రలేఖ, రాజేశ్వరి, హసీనా, రాష్ట్ర కార్యదర్శి దేవి, జిల్లా కార్యదర్శి సుశీలమ్మ, ఉపాధ్యక్షురాలు సుజాత, రాధ, భారతి, అంజలి, పార్వతి, ప్రసన్న, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.


వైసిపి కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న వైసిపి మహిళా నేతలు

02ATP08_02ATP08.qxd 08-03-2026 PM 11:10 Page 1



## వైభవంగా స్వారమ్మ దేవి రథోత్సవం

- పాల్గొన్న ఆంధ్ర, కర్ణాటక భక్తులు

అమరాపురం మార్చి 8 ప్రభాతవార్త



రథోత్సవ దృశ్యం

మండల సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం మద్దే వు, కరేక్యాతనహళ్లి గ్రామాల మధ్యలో ఉన్న స్వారమ్మదేవి దేవాలయం వద్ద అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం వేడుకలు వైభవంగా ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తాతులచే వైభవంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా అమ్మవారి మూల విగ్రహానికి తెల్లవారు జామునే ఆలయ అర్చకులు అభిషేకం అర్చనలను నిర్వహించారు. ప్రత్యేక పూలతో అలంకరణ చేసి అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు. అనంతరం రంగురంగుల పూలతో అలంకరించబడిన రథోత్సవము వద్దకు అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగింపు తీసుకుని వచ్చి రథోత్సవంలో ఉంచి అమ్మవారి నామస్మరణ చేస్తూ ఆంధ్ర కర్ణాటక ప్రాంతానికి చెందిన భక్తులు రథాన్ని లాగారు. మొక్కుబడిగా అరటి పండ్లు, బెల్లం, బురుగులను విసిరినారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేమావతి గ్రామానికి చెందిన సిద్దేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, విజయ్ గౌడ్, ఉప్పార్లపల్లి శివకుమార్ పాల్గొన్నారు

## ఎన్నాళ్లకెన్నాళ్లకు స్వయంభేశ్వరాలయానికి సిసి రోడ్డు

- దాదాపు రూ.40 లక్షలతో నిర్మాణం



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ సర్పంచు అశ్వత్థప్ప

చిలమత్తూరు, మార్చి 8 ప్రభాతవార్త

పచ్చని పొలాల మధ్య చెరువు కింద మాగాని భూముల్లో వెలసిన ఉద్భవ స్వయంభేశ్వరాలయానికి సిసి రోడ్డు నిర్మాణం పనులతో నూతన శోభ సంతరించుకుంది. మా భూముల్లో రోడ్డు వద్దని కొందరు, మా భూమి రోడ్డుకు ఎక్కువగా వెళుతోందని మరికొందరు ఇలా దాదాపు 8 నుండి 9 సంవత్సరాలుగా సిసి రోడ్డు ఏర్పాటుకు ఎన్నాళ్లకెన్నాళ్లకు వేచి వున్న సమయం ప్రస్తుతం ఎమ్మెల్యే బాలకృష్ణ సహకారంతో దాదాపు 40 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణం హైవే లింకురోడ్డు గుండా పనులు ప్రారంభమయ్యాయి. చాలా ఏళ్ల తరువాత ఆలయానికి నూతన సిసి రోడ్డు ఏర్పాటుపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాజీ సర్పంచు అశ్వత్థప్ప గుత్తేదారునిగా వ్యవహరిస్తూ సిసి రోడ్డు నాణ్యతను పెంచేలా బీటలుబారకుండా వుండేలా ప్రమాణాల చర్యలను పాటిస్తూ రోడ్డు వేస్తున్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి ఆలయ సిబ్బందితో పాటు ముఖ్యంగా ఆలయానికి వెన్నెముకగా వుండి నడిపించిన మాజీ కన్వీనర్ నందీశప్ప పాత్ర మరువలేనిదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

## ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నేత మనోహర్

గోరంట్ల, మార్చి 8 ప్రభాతవార్త

గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ పంచాయతీలో ఆదివారం ప్రపంచ మహిళా దినోత్సవం వేడుకలను ఆర్డీటి సంస్థ, మహిళల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మహిళలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటి ఉద్యోగులు నరసింగరావు, నారాయణస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు మనోహర్, మూర్తి పాల్గొన్నారు.

## గ్రామగ్రామానికీ "సాయి" సేవలు విస్తరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

లేపాక్షి, మార్చి 8 ప్రభాతవార్త

మానవ సేవయే మాధవ సేవ అన్న సత్యసాయిబాబా సూక్తిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా సేవా సంస్థల అధ్యక్షుడు సత్య నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం లేపాక్షిలోని అన్నదాన భవనంలో సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బాబా ఆశించిన సేవా కార్యక్రమాలు కేవలం పట్టణాలకే పరిమితం కాకూడదని, ప్రతి పల్లెకూ, ప్రతి పేదవాడికీ అందాలని ఆకాంక్షించారు. సేవా పథంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అప్పుడే సమాజంలో మార్పు వస్తుందని పేర్కొన్నారు. బాబా చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన ఆశయాలను నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యత భక్తులందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ ఎం.సీతారాం, బాలవికాస్ జిల్లా కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్, యూత్ కోఆర్డినేటర్ సునీత, లేపాక్షి సేవా సమితి రాఘవేంద్రభట్‌తో పాటు వీరభద్ర అన్నదాన ట్రస్ట్ సభ్యులు రాంప్రసాద్, అంజనరెడ్డి, వెచ్చం రవీంద్రనాథ్, వీరన్న, భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

## వాల్మీకుల ఎస్‌టి పునరుద్ధరణకై ఐక్యంగా పోరాడుదాం



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బోయ సుంకప్ప

గుంతకల్లు, మార్చి 8 ప్రభాతవార్త

వాల్మీకుల ఎస్‌టి పునరుద్ధరణకై ఐక్యంగా పోరాడాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఎస్‌టి పునరుద్ధరణ కోరుతూ వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు బోయ సుంకప్ప ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు చేపట్టిన 36 గంటల దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, ఎంపీపీ మాధవి, వాల్మీకి సంఘం నాయకులు రామలింగప్ప, చాముండి, గాది లింగేశ్వరబాబు, మస్తానయ్య, ఎద్దుల శంకర్, పార్వతప్ప, రాధాకృష్ణ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ భీమలింగప్ప, కౌన్సిలర్ లింగన్న, బిజెపి నాయకులు రంగన్న, తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని వారు కోరారు.

## బీజామృతం, నవధాన్యాలసాగుపై అవగాహన



సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరాపురం మార్చి 8 ప్రభాతవార్త

మండల పరిధిలోని కె.శివరం గ్రామంలోసొంచన్న పొలంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయం ఎల్ వన్ ఎఫ్ ఎం టి శివరం ప్రసన్న ఆధ్వర్యంలో నవ ధాన్యాల సాగు మరియు బీజామృతం పైన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ టు. శివకుమార్, ఎల్ త్రీ శ్రీనివాస్ ఎన్ ఎఫ్ ఐ ఆంజనేయులు సమక్షంలో టి ఐ సి ఆర్ పి లకు మండల ఎఫ్ ఎం టి శివరం ప్రసన్న క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పొలాల్లో నవ ధాన్యాల సాగు చేయడం మరియు బీజామృతం, విత్తన శుద్ధి, విత్తన గుళికలు, పిఎండిఎస్ సాగు గురించి ఆయన టి ఐ సి ఆర్ పి లకు వివరించారు. రసాయనిక ఎరువులు లేకుండా ప్రకృతి సంపద ద్వారా పంటల సాగు చేసి అధిక దిగుబడిని సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సొంచన్న ఎకరా పొలంలో 29 రకాల విత్తనాలను 25 కేజీల విత్తనాలు మొత్తం కలిపి భూమిలో విత్తినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐసీఆర్పీలు భువనేశ్వరి, పి మంజుల, ఎస్. నాగమణి, జయమ్మ, పి. ఎన్. నాగమణి, సుశీల తదితరులు మరియు రైతు సొంచన్న సపాల్గొన్నారు

## జడ్పీ సెంట్రల్ హైస్కూల్లో హ్యాపీ సండే

పెనుకొండ మార్చి 8 ప్రభాతవార్త



జడ్పీ సెంట్రల్ హైస్కూల్లో హ్యాపీ సండే దృశ్యం

పట్టణంలోని జడ్పీ సెంట్రల్ హైస్కూల్ నందు హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సూచనలు మేరకు పట్టణములోని జడ్పీ ప్రభుత్వ సెంట్రల్ హైస్కూల్ నందు హ్యాపీ సండే కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు, పట్టణ టిడిపి మహిళా అధ్యక్షురాలు రమణమ్మలు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలలో ప్రతి 2ఆదివారం, 4ఆదివారం పాఠశాలలలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులలో సంతోషం పెరుగుతుందని, తద్వారా మానసిక ఉల్లాసం కలిగి పిల్లలలో ఏకాగ్రత జరుగు తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో గేములతో పాటు పాటలు డాన్సులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, హై స్కూల్ సిబ్బంది, టిడిపి నాయకులు నంజుండ, జనసేన మహిళ నాయకురాలు శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరంగారావు

తాడిమర్రి మార్చి 8 (ప్రభాతవార్త)

మండల పరిషత్ కార్యాలయం లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఎంపీడీవో వెంకట రంగారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రంగారావు మాట్లాడుతూ మహిళలు పురుషులకు సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. మహిళలకు సమాజంలో గౌరవ, మర్యాదలతో పాటు ఉన్నత స్థాయిలో ఎదగడానికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, పంచాయతీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## వీరభద్ర అన్నప్రసాద సేవా ట్రస్ట్‌లో మహిళలకు సత్కారం



మహిళా వాలంటీర్లను సన్మానించిన దృశ్యం

లేపాక్షి, మార్చి 8 ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక వీరభద్ర అన్నప్రసాద సేవా ట్రస్ట్‌లో మహిళా వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. సమాజ సేవలో, నిత్య అన్నదాన కార్యక్రమాల్లో మహిళలు చూపుతున్న చొరవను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ట్రస్ట్‌లో నిరంతరం భక్తులకు అన్న ప్రసాద సేవలు అందిస్తున్న నళినాక్షి, త్రివేణి, నిర్మలను పలువురు మహిళలు ఘనంగా సన్మానించారు. అనంతరం ట్రస్ట్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనే సేవా కార్యకర్తలు నాగమ్మ, లలితమ్మ, పద్మక్క, రాధమ్మలను నిర్మల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదని, ప్రతి రంగంలోనూ వారు తమ ప్రతిభను చాటుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా సేవా రంగంలో మహిళల భాగస్వామ్యం సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆకలి తీర్చే అన్నదాన సేవలో మహిళల సహకారం వెలకట్టలేనిదని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాంప్రసాద్, అంజనరెడ్డి, రవీంద్రనాథ్, వీరన్న, హనుమంతు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి

ధర్మవరంటౌన్, మార్చి 8 ప్రభాతవార్త



మృతిచెందిన చైత్ర

విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందిన సంఘటన ఆదివారం పట్టణంలోని యాదవ వీదిలో జరిగింది. వన్ టౌన్ సీఐ నాగేం ద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. యాదవవీదికి చెందిన పవనకుమార్ భార్య చైత్ర(38) టైలరింగ్ పనిచేసుకుంటూ జీవనంసాగించేది. ఈ క్రమంలో చైత్ర ఇంటిలో నీళ్లతో శుభ్రం చేస్తుండగా అక్కడే ఉన్న కుట్టుమిషన్ కరెంటు మోటారు అమర్చిన ఫెడల్ కు నీళ్లు తగిలిప్రమాదవ శాత్తు చైత్రకు కరెంట్ షాక్కు గురై మృతిచెందింది. మృతురాలికి ఒక కుమారుడు. ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు వన్ టౌన్ సీఐ తెలిపారు

## సామాజిక అభివృద్ధిలో మహిళల పాత్ర మరువరానిది

- కూటమి ప్రభుత్వ విజయంలో మహిళలదే కీలకపాత్ర



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న టీడీపీనాయకులు

ధర్మవరంటౌన్ , మార్చి 8 ప్రభాతవార్త

సామాజిక అభివృద్ధిలో మహిళల పాత్ర మరువరానిదని నియోజకవర్గ టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ చింతలపల్లి మహేశ్ చౌదరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఆదివారం స్థానిక ఎర్రగుంట టీడీపీ కార్యాలయంలో తెలుగు మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలతో కలిసి టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం తెలుగు మహిళలను సత్కరించి చీరలను పంపిణీచేశారు. అనంతరం మహేశ్ చౌదరి మాట్లాడుతూ యావత్ సమాజంలో సగభాగమైన మహిళలు సామాజిక పురోభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్నారని చరిత్రలో కూడా మహిళల పాత్ర మరువలేనిదని కొనియాడారు. అలాగే గత వైసీపీ అరాచక పాలనలో తెలుగుమహిళల పోరాటం అందరికి ఆదర్శప్రాయకంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణఅధ్యక్షులు పరిశేసుదాకర్, దూదేకులసంఘం రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ రాళ్లపల్లిషరీఫ్, మైనార్టీ టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి నాగూర్ హుసేన్, నాయకులు పణికుమార్, భీమినేని ప్రసాద్ నాయుడు, రామాంజి, విజయసారధి, చట్టాలక్ష్మీ నారాయణ, మాధవరెడ్డి, చీమల రామంజి, సిబిఎన్ రామకృష్ణ, తెలుగుమహిళలు ముతుకూరు బీబీ, సునంద, కత్తులసునీత, మాలతి, మహాలక్ష్మి, తదితరులు, పాల్గొన్నారు. కాకతీయ విద్యానికేతన్లో:పట్టణ సమీపంలోని కాకతీయ విద్యానికేతన్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్ పద్మలు కేక్ కట్ చేశారు. అనంతరం మహిళా ఉపాధ్యాయ బృందంతోపాటు పాఠశాల విద్యార్థుల తల్లులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

## స్మశాన వాటికలు సాధించేవరకు పోరాటాలు చేస్తాం



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి

ధర్మవరంటౌన్ , మార్చి 8 ప్రభాతవార్త

చనిపోయిన వారిని పూడ్చడానికి స్మశాన వాటికలు లేకపోవడంతో పోరాటాలు చేయాల్సిన అవసరం రావడం సిగ్గుచేటని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి పేర్కొన్నారు. స్మశాన వాటికల సాధన కోసం చేపట్టిన జీపుజాత ఆదివారం ధర్మవరంకు చేరుకుంది. ఈ సందర్భంగా సాకేహరి కళా జ్యోతిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అంటరానితనం, కులవ్యవక్తత, దోపిడీ, దళిత, గిరిజనులను వెంటాడుతుంటే చస్తే పూడ్చడానికి స్మశానాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో శవాలను ఇళ్ల ముందు ఉంచుకుని బాధపడిన సందర్భాలు అనేకమన్నారు. స్మశాన వాటికల సమస్యలు పరిష్కరించాలని ఎన్నోసార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకపోవడం బాధాకరమన్నారు. శవాలను ప్రభుత్వ కార్యాలయాల ముందు ఉంచుకొని ఆందోళన చేపినప్పటికీ స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు తుంపర్తి పరమేశ్, వైసీపీ పార్టీ నాయకులు చౌడప్ప, దేవేరకొండరమేశ్, బీఎస్పీ పార్టీ వినయ్, మాదిగరక్షణపోరాటసమితి నాయకులు కేశగాళ్ల వెంకటేశ్, మాలమహానాడు సంఘంనాయకులు కోట్ల గంగాధర్, నాయకులు మంజుల నరేంద్ర, లోకేశ్, శ్రీదర్, ఓబులేశు పాల్గొన్నారు.

## ఆకుపై మహిళల చిత్రాలు

రామగిరి, మార్చి 8, ప్రభాతవార్త



ఆకుపై పేరు మోసిన మహిళ చిత్రాలు

మండలంలోని పేరూరులోగల మహాత్మాజ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో చిత్ర కళా ఉపాధ్యాయుడు శ్రీరాములు, ప్రకృతి ప్రసాదించిన ఆకుపై మానవీయ విలువల కోసం పోరాడిన వీర వనితల చిత్రాలను చిత్రీకరించారు. ఆదివారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక టేకు ఆకుపై ఆయన విప్లవ కారుని కల్పన చార్యులు, ఓప్రావిన్‌ఫ్రే, క్రీన్‌డయానా, మరో భారతీయ మహిళా చిత్రాన్ని చిత్రీకరించారు. ఆకుపై ప్రపంచ స్థాయి ప్రఖ్యాతి గాంచిన వీర మహిళల ఫోటోలు చిత్రీకరించడం అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయ బృందం అన్నారు. ఎప్పటి చిత్రాలను తన దైన శలిలో అందంగా చిత్రీకరించడం అభినందనీయమన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కనగానపల్లి మార్చి 8 ప్రభాతవార్త



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కేజీ. నాగమణి

మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయం నందు ఆదివారం మండల గ్రంథాలయ అధికారి కేజీ. నాగమణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా కేజీ. నాగమణి మాట్లాడుతూ ఇందిరాగాంధీ మహిళలకు వన్నెతెచ్చారని ఆమె సేవలను కొని యాడారు. అనంతరం చదువు అంటే మా ఇష్టం అనే కార్యక్రమంను నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాల బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

## ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన

ధర్మవరం రూరల్ మార్చ్ 8 ప్రభాతవార్త



శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం మండలం పోతుల నాగేపల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రీ ఆంజనేయ స్వామి ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమం జరిగింది. ఆలయం వద్ద అర్చకులు వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వేదమంత్రాలతో ధ్వజస్తంభ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దల సమక్షంలో ఆలయం వద్ద పూజా కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. బిజెపి నాయకులు రాజశేఖర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో మహిళల పాత్ర అనితర సాధ్యం



ఎంపీడీఓ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

బత్తలపల్లి, మార్చి 8 ప్రభాతవార్త

మహిళలు తల్లిగా.. భార్యగా.. గృహిణిగా అనేక పాత్రలు పోషిస్తూనే మరోవైపు ఉద్యోగ, ఉపాధి రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని ఎంపీపీ బగ్గిరి త్రివేణి మహిళల పాత్రపై కొనియాడారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, కార్యాలయ పరిపాలన మల్లిఖార్జున తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర కీలకమన్నారు. సమాజంలో ఒకప్పుడు మహిళలంటే చిన్నచూపు ఉండేదని. మహిళలంటే గౌరవం పెరుగుతోందని వారిని గౌరవించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందని కొనియాడారు. మహిళలంటే ఆబలలు కాదని సమాజానికి చాటి చెబుతున్నారన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలోనూ రాణిస్తున్నారని అయినా ఒక్కడో ఒకచోట వివక్షతకు గురవుతున్నారన్నారు. మహిళల్లో ఓర్పుతో పాటు పట్టుదల అధికంగా ఉంటుందన్నారు. ఇంట్లో మహిళ చదువరి అయితే ఆ ఇల్లంతా అభివృద్ధి చెందడమే. కాకుండా సమాజం కూడా ప్రగతిపధాన వెలుతుందన్నారు. ఆనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని కేక్కట్ చేసి మహిళా ప్రజా ప్రతినిదులను. అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపవాస ముస్లిం సోదరులకు కొబ్బరి బొండాలు అందించిన ఎమ్ ఎస్ ఎస్ సేవా సంస్థ

అనంతపురం రూరల్, మార్చి 08 ప్రభాతవార్త



ముస్లిం సోదరులకు కొబ్బరి బోండాలు అందిస్తున్న దృశ్యం

అనంత రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్ లో గల ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకుఎం ఎస్ ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రంజాన్ మాసం లో ఉపవాసము ఉన్న ముస్లిం సోదరులకు రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్ లో ఉన్న రహమతే మజీద్ లో నమాజ్ ముగించుకుని ఇఫ్తార్ విందుకు వచ్చిన వారికి కొబ్బరి బోండాలు పంపిణీ చేసిన ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ, ఎం ఎస్ ఎస్ సేవా సంస్థ అధ్యక్షులు సాదిక్ వలి, సభ్యులు పాల్గొన్నారు

## గుడి నిర్మాణానికి ఎన్ఆర్ఐ విరాళం



విరాళం అందజేస్తున్న కుటుంబ సభ్యులు

గోరంట్ల మార్చ్ 8 ప్రభాతవార్త

గోరంట్ల మండలంలోని పులేరు పంచాయతీ పరిధిలోని మరి రెడ్డి పల్లి గ్రామం లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి తన ముద్దు బాధ్యతగా సమాజ సేవకుడు, అమెరికాలో స్థిరపడ్డ బూడిదిగడ్డ పల్లి గ్రామవాసి ఎన్ఆర్ఐ శేషానంద రెడ్డి తన వద్ద బాధ్యతగా ఆలయ నిర్వాహకులకు తన కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ఆదివారం రూ, 2 లక్షల విరాళాన్ని అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం గోరంట్ల పట్టణంలోని ఆయన నూతన గృహం వద్ద ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని గ్రామ గుడి నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రామ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేసిన సమాజ సేవకుడు ఎన్ఆర్ఐ శేషామందరెడ్డి మరియు ఆయన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మమిళా దినోత్సవం

రామగిరి, మార్చి 8 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని రామగిరిలోని షిర్డిసాయి విద్యానికేతన్‌లో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులచే ఆ పాఠశాల కరస్పాండెంట్ ముత్యాల్‌చౌదరి కేక్ కట్ చేయించారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయునిలే పేని చేస్తుండటంతో వారిని పాఠశాలకు ఆమ్వానించి మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని ఎక్కడ ఏ పనికి వెళ్లినా అంకిత భావంతో పని చేస్తూ అందరి మన్ననలను పొందుతున్నారన్నారు. మమిళలు కుటుంబంలో తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తు పిల్లలను తీర్చిదిద్దడంతో ముందుంటారన్నారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. వీరిని లేపాక్షిని సందర్శించారు. అదే విధంగా వీరాపురం సైబేరియన్ పక్షులను చూడటానికి కూడా వెళ్లారు. పాఠశాలలో విద్యార్థులను కూడా తీసుకెళ్లామని ఆయన తెలిపారు.

## చీఫ్ సూపర్డెంట్లు డిపార్ట్మెంట్ ఆఫీసర్స్‌కి ఓరింటేషన్ ప్రోగ్రాం

కొత్తచెరువు మార్చ్ 8 ప్రభాతవార్త

ఈనెల 16 నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మరియు ఓపెన్ టెన్త్ పరీక్షలు నిర్వహణకు సంబంధించి సెంటర్స్ చీఫ్ సూపరిడెంట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ కి ఈనెల 10వ తేదీ పుట్టపర్తి రూరల్ పరిధిలో ఉన్న జగరాజు పల్లి మంగళకర డిగ్రీ కాలేజ్ నందు ఒకరోజు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించబడునని డిఇఒ జి కృష్ణప్ప ప్రకటనలో తెలిపారు. ఈ ఓరెంటేషన్ ప్రోగ్రాం మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించబడును ఈ కార్యక్రమానికి కడప ఆర్జెడి శ్యాముల్ విచ్చేయనున్నారు కావున చీఫ్ సూపర్ ఇండియన్స్ మరియు డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ తప్పనిసరిగా మండల విద్యాశాఖ అధికారులు ఈ కార్యక్రమంలో నందు పాల్గొనాలని డీఈవో తెలిపారు చీఫ్ సూపరిండెంట్స్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ మండల విద్యాశాఖ అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు

## ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న టిప్పర్

- ఇంటర్మీడియట్ విద్యార్థి మృతి

చిలమత్తూరు, మార్చి 8 ప్రభాతవార్త

టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అతివేగంతో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఓ నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. వివరాలు ఇలా వున్నాయి. చిలమత్తూరు మండలం టేకులోడు క్రాస్ కనుమ ప్రధాన రహదారిలో ఆదివారం అతి వేగంగా వచ్చిన టిప్పర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న సంఘటనలో మండలంలోని లక్ష్మీపురంకు చెందిన గజేంద్ర అనే ఇంటర్మీడియట్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. నిత్యం ఈ రహదారి గుండా టిప్పర్ వాహనాల్లో కంకర, రాయి, మట్టిని తరలిస్తుంటారు. అయితే అన్ని వాహనాల కన్నా టిప్పర్ వాహనాలు అతివేగంగా రోడ్డుపై డ్రైవింగ్ చేస్తుండడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి టిప్పర్ వాహనాల అతివేగానికి కళ్లెం వేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

06ATP08_06ATP08.qxd 08-03-2026 PM 11:17 Page 1



## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, మార్చి 8 ప్రభాతవార్త

నేటి సమాజంలో మహిళలు పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. గుత్తి పట్టణంలో ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం సునీత, శ్రీదేవిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, పార్టీ కన్వీనర్ ఎంకే చౌదరి, మండల కన్వీనర్ లక్ష్మీరంగయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనా, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## మసీదు నిర్మాణానికి ఆర్థిక సహాయం

కంబదూరు, మార్చి 8, ప్రభాతవార్త



ముస్లిం మత పెద్దలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

కంబదూరు మండలం రాళ్లఅనంతపురం గ్రామంలో మసీదు నిర్మాణం కోసం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తన ఉదారతను చాటుకున్నారు. ముస్లిం సోదరుల విన్నపం మేరకు తక్షణమే స్పందించిన ఆయన, తన సొంత నిధుల నుంచి రూ. 1.50 లక్షల ఆర్థిక సాయాన్ని ఆదివారం ప్రజా వేదికలో మైనారిటీ నాయకులకు అందజేశారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ ఎమ్మెల్యే చేసిన ఈ సాయంపై ముస్లిం మైనారిటీలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అమిలినేనిని మర్యాదపూర్వకంగా కలసిన విద్యుత్ శాఖ ఈఈ

కళ్యాణదుర్గం మార్చి 8 ప్రభాతవార్త



ఎమ్మెల్యే ను కలిసిన విద్యుత్ శాఖ ఈఈ

కళ్యాణదుర్గం విద్యుత్ శాఖ ఎక్సిక్యూటివ్ ఇంజనీర్ గా బాధ్యతలు చేపట్టిన కళ్యాణ్ చక్రవర్తి ఆదివారం ప్రజావేదికలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ నియోజ కవర్గంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఎప్పటి కప్పుడు అందించి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారుల దృశ్యం

బ్రహ్మసముద్రం మార్చి 8 ప్రభాతవార్త

బ్రహ్మసముద్రం మండలం కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం నందు ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా "మహిళా బాలికా స్నేహ పూర్వక గ్రామ పంచాయితీ " అనే విషయం పై మండంలోని అందరూ మహిళా ప్రజా ప్రతినిధులకు ఒక రోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ శిక్షణ కార్యక్రమం నందు డిప్యూటీ యం.పి.డి.ఓ. యోగేష్, మండల స్వర్ణ గ్రామ సచివాలయ అధికారి సమీర్ ఖాన్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయితీ పంచాయతీ అభివృద్ధి అధికారులు అనిల్, కవిత,ఉమామహేశ్వరి, మహిళా ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## మొల్లమాంబ జీవితం ఆదర్శప్రాయం

- వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నైరుతిరెడ్డి

గుంతకల్లు, మార్చి 8 ప్రభాతవార్త

కవయిత్రి మొల్లమాంబ జీవితం ఆదర్శప్రాయమని వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని అజంతా సర్కిల్లో ఏర్పాటు చేసిన మొల్లమాంబ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం నైరుతిరెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా గోపవరంలో జన్మించిన మొల్లమాంబ తెలుగు సాహిత్యంలో రామాయణాన్ని రాసిన తొలి మహిళా కవయిత్రి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు కొనకొండ్ల అంజి, పార్టీ సీనియర్ నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, నాయకులు బాబురావు, బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రంగనాయకులు, యూత్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షులు అబ్దుల్‌బాసిత్, నాయకులు పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాముల సేవలో వైసిపి నాయకులు

కనేకల్ మార్చి 8 ప్రభాతవార్త



స్వామివారిని దర్శించుకున్న వైసిపి నాయకులు

కనేకల్ పట్టణంలో శ్రీ సీతారాముల ను దర్శించిన వైసీపీ నాయకులు మాదవ రెడ్డి,ఉపేందర్ రెడ్డి, ఆదివారం స్వామివారిలను సందర్శించారు.మాధవ రెడ్డి ఉపేంద్ర రెడ్డి నాయకులు, ముఖ్య అతిథులుగా విచ్చేశారు కనేకల్ వైఎస్ఆర్ పార్టీ నాయకులు మరియు ఆలయ కమిటీ వారు కార్యకర్తలు వారిని స్వాగతించి స్వామివారి సన్నిధిలో వారి పేరు మీద అర్చన గోత్ర నామాలు జరిపించి అనంతరం ఆలయ కమిటీ వారు నాయకులను మాధవ రెడ్డి ఉపేందర్ రెడ్డి వారిని సన్మానించారు, ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు అందరు పాల్గొన్నారు.

## సీతారాముల ఆలయాన్ని దర్శించిన కాలవ



నూతన దేవాలయాలు దర్శించిన ఎమ్మెల్యే కాలవ

కనేకల్లు మర్చి 8 ప్రభాతవార్త

కనేకల్ పట్టణంలో రామ్ నగర్ ఏరియా నందు నూతనంగా వెలసినటువంటి శ్రీ సీతారామ సమేత రాముని దేవాలయ పూజలలో రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్పు కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ లక్ష్మణ సమ్మేత ఆంజనేయ స్వామి, వెంకటేశ్వర స్వామి,శివ నందీశ్వరుల దేవత మూర్తులను కాల్వ శ్రీనివాసులు తోపాటు తెదేపా పలువురు నాయకులు దర్శించారు.. ఉదయాన్నే విగ్రహ ప్రతిష్ఠ - ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మరియు ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలతో పాటు శ్రీ వెంకటేశ్వర స్వామి, మహా శివుడు, నందీశ్వరుడు విగ్రహమూర్తులను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమాలు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు, యాగాలు నిర్వహిస్తూ భక్తి శ్రద్ధలతో జరిగాయి. పండితుల వేద మంత్రాల మధ్య ఆలయ విగ్రహాలను ప్రతిష్ఠించి అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమాన్ని చూడడానికి కనేకల్ పట్టణం మరియు పరిసర గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొని తమ కోరికలను విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కూడా పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.

## మొక్కజొన్న కంకి నిప్పంటించిన దుండగులు



అగ్ని నుండి మొక్కజొన్న కంకిని వేరు చేస్తున్న రైతులు

డి.హిరేహళ్ మార్చి 8 ప్రభాతవార్త

మొక్కజొన్న కంకి కోసి పొలంలో ఆరబెట్టిన మొక్కజొన్న పంటకు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించడంతో రైతు వాల్మీకి సంజప్ప గారి తిప్పేస్వామి పూర్తిగ నష్టపోయారు. ఆదివారం డి.హిరేహళ్ మండలం కాదులూరు గ్రామానికి చెందిన రైతు తన ఐదు ఎకరాల పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంట కోతకు రావడంతో కోసి నూర్పిడి కోసం ఆరబెట్టారు. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు వాణిజ్య పంట మొక్కజొన్న పంటకు దుండగులు నిప్పంటించడంతో 150 క్వింటాళ్ళకు పైగ ధాన్యం పూర్తిగా కాలిపోయిందని దీంతో రైతుకు రూ. 2,50000లు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. పొలంలో పంట కాపలా ఉన్న రైతు భోజనం కోసం ఇంటికి వచ్చిన సమయంలో దుండగులు ఉద్దేశపూర్వకంగ పంటకు చుట్టూ నిప్పు అంటించి కాల్చారని బాధిత రైతు కుటుంబ సభ్యులు వాపోయారు. మొక్కజొన్న కంకి నిప్పంటుకొని కాలుతున్న విషయాన్ని గమనించిన వ్యక్తులు బాధిత రైతుకు సమాచారం అందించడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని అరకొరగా కాలిన కొంత పంటను అగ్ని నుండి వేరు చేశారు. అప్పటికే ఆ రైతుకు జరగాల్సిన నష్టం జరిగిపోయిందని ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఇలా అగ్నికి ఆహుతవడంతో అప్పుల పాలయ్యామని బాధిత రైతు కుటుంబ సభ్యులు ఆవేదనకు గురయ్యారు. మొక్కజొన్న పంటకు నిప్పంటించిన దుండగులు సంఘటన స్థలంలో మద్యం సేవించి బీరు బాటిల్ ను అక్కడే పడేసి వెళ్లినట్లు గ్రామస్తులు ద్వారా తెలిసింది. ఈ సమాచారం అందుకున్న ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పంటకు నిప్పంటుకున్న విధానాన్ని పరిశీలించి బాధిత రైతును విచారించి సమాచారం తెలుసుకున్నారు. ఈ విషయమై ఎస్ఐ మాట్లాడుతూ బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి పంటకు నిప్పంటించిన దుండగులను గుర్తించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. మండలంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ నిఘా ఏర్పాటు చేసి తగిన చర్యలు చేపడుతామని ఆయన తెలిపారు.

## నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షుడు



వధూవరులను ఆశీర్వదిస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షుడు

డి.హిరేహళ్ మార్చి 8 ప్రభాతవార్త

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప వివా హ వేడుకల్లో పాల్గొని నూతనదంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన ఆ సేవా సమితి ప్రధాన సలహాదారులు తలారి రాజప్ప, మీడియ సలహాదారులు తలారి మల్లయ్య, మిత్రులతో కలిసి పాలాక్షరెడ్డి, నిర్మల దంపతులు, ఆనందరెడ్డి, లావణ్య దంపతు ల ఆహ్వానం మేరకు రాయదుర్గం పట్టణంలోని నేషనల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులు అంజలి, చైతన్యకుమార్ రెడ్డి లను దీవించి ఆశీర్వదించి ఆశీస్సులు అందించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నూతన దంపతులతో మాట్లాడుతూ మీ వివాహ జీవితం సుఖ సంతోషాలతో సాగాలని ఎలాంటి మనస్పర్థలకు తావివ్వకుండా మీ జీవితానికి మీరే బంగారు బాటలు వేసుకోవాలని ఆయన వధూవరులకు తెలిపారు. మూడుముళ్ల బంధంతో ఒకటైన మీ దాంపత్య బంధం మీ ముందు తరాల వారికి ఆదర్శంగా నిలవాలని ఆయన నూతన దంపతులకు సూచించారు. ఈ కార్యక్రమం లో మిత్రులు పైగేరి సిద్దేశ్వర హమాలి యూనియన్ అధ్యక్షులు కురుబ గురుమాల్ శ్రీనివాసులు, విశ్రాంతి ఉద్యోగి గొల్ల గోపాల్ పాల్గొన్నారు.

## సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

ధర్మవరంటౌన్, మార్చి 8 ప్రభాతవార్త

నియోజకవర్గంలోని యువతకు ఉన్నత విద్యాఅవకాశాలు కల్పిస్తూ, వారిని దేశసేవ దిశగా ప్రోత్సహించేవిధంగా రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శ్రీకారంచుట్టినట్టు ఆయన కార్యాలయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. సంస్కృతి సేవా సమితి సహకారంతో, మంత్రి చొరవతో పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెంకటపాటి విద్యాదీవెన కార్యక్రమం ద్వారా సివిల్ సర్వీసెస్‌తో పాటు ఇతర పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించే కార్యక్రమం ప్రారంభించబడినట్టు మంత్రి కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ స్టడీ సర్కిల్ సహకారంతో తొలివిడతలో 28 మంది విద్యార్థులకు పూర్తిస్థాయి మద్దతు అందించడం జరిగిందన్నారు. దాతలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని మరింతబలోపేతంచేస్తూ దాదాపు 200 మంది సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. అసక్తిగల యువతి యువకులు 7842054669, 7998256789 నెంబర్లకు ఫోన్ చేసి ఈనెల 10వతేదీలోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

విద్య, విజ్ఞానం, రాజకీయాలు, క్రీడలు, వ్యాపారం

## ప్రతి రంగంలో మహిళలు ముందడుగు : మమతా గుప్తా



మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

గుంతకల్ రైల్వే, మార్చి 08, ప్రభాతవార్త

గుంతకల్ రైల్వే డివిజన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మమతా గుప్తా మరియు ఉపాధ్యక్షురాలు సునీత లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళల దినోత్సవం (ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే )ను జరుపుకుంటున్నాము మహిళల హక్కులు, సమానత్వం, సామాజిక-ఆర్థిక అభివృద్ధి కోసం మహిళలు చేసిన పోరాటాన్ని గుర్తు చేస్తూ ఉమెన్స్ డే నిర్వహిస్తున్నామన్నారు.మహిళల సాధికారతను గుర్తు చేస్తూ సమాజంలోని అన్ని రంగాల్లో మహిళలు సమాన అవకాశాలు పొందేలా అవగాహన కల్పించడమే ఉమెన్స్ డే లక్ష్యం. మహిళల హక్కుల పరిరక్షణ, లింగ సమానత్వంపై అవగాహన, మహిళల విజయాలను గౌరవించడం, సమాజంలో మహిళల పాత్రను గుర్తించడం, విద్య, విజ్ఞానం, రాజకీయాలు, క్రీడలు, వ్యాపారం వంటి ప్రతి రంగంలో మహిళలు అద్భుత విజయాలు గుర్తు చేస్తూ స్ఫూర్తి పెంచడమే లక్ష్యంగా దీనిని ముందుకు తీసుకెళ్తన్నాము అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని వారం రోజుల పాటు జరుగిన వేడుకలలో భాగంగా అధ్యక్షురాలు మమతా గుప్తా ఉపాధ్యక్షురాలు సునీత మరియు సంస్థ సభ్యుల సహకారంతో పలు పోటీలు నిర్వహించారు. వీటిలో భాగంగా రంగోలీ, ఫైర్‌లెస్ కుకింగ్, వ్యాసరచన మరియు డ్రాయింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు, వాటిలో మహిళలనుండి ఉత్సాహభరితమైన స్పందన కనిపించింది. ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం మహిళల సాధనలు మరియు ఆత్మస్ఫూర్తిని జరుపుకుంటూ, పాల్గొనేవారిలో సృజనాత్మకత, ప్రతిభ మరియు చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం జరింగిదన్నారు. ఈ కార్యక్రమం లో రైల్వే ఉద్యోగులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

## స్వర్ణ నంది పురస్కారం అందుకున్న గుత్తి చిన్నారి



పురస్కారం అందుకుంటున్న దృశ్యం

గుత్తి, మార్చి 8 ప్రభాతవార్త

పట్టణానికి చెందిన ఆర్.ఆర్ డాన్స్ అకాడమీ విద్యార్థిని చిన్నారి దీప్తి తన నృత్య ప్రతిభతో స్వర్ణ నంది పురస్కారం పొందింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నవభారత్ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన త్యాగరాయగాణ సభలో ఆ చిన్నారి తన ప్రతిభతో అందరిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో ఆ చిన్నారికి స్వర్ణ నంది అవార్డును కళాక్షేత్రం వారు అందజేశారు. చిన్నారి దీప్తిని డాన్స్ అకాడమీ చైర్మన్ రవి తదితరులు అభినందించారు.

## తొండపాడులో సామూహిక వివాహాలు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

గుత్తి, మార్చి 8 ప్రభాతవార్త

మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథస్వామి దేవస్థానంలో ఆదివారం పైలా నరసింహయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరయ్యారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు గావించారు. అనంతరం 24 మంది జంటలకు ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహించారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు, ఇంటికి కావాల్సిన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసింహయ్యయాదవ్ ఉచితంగా వివాహాలు చేయించడం హర్షినీయమని అభినందించారు.. స్వామివారి ఆశీస్సులతో నూతన దంపతులు సంతోషంగా జీవించాలని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు, ఎన్డిఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం



వక్తలు మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, మార్చి 8 ప్రభాతవార్త

పరీక్షలు అంటే ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ఆత్మస్థైర్యంతో నైపుణ్యతతో రాణించాలని ఎక్సైజ్ సిఐ ఉమాదేవి, ఎస్ఐ సురేష్‌బాబు, తదితరులు సూచించారు. స్థానిక మోడల్ స్కూల్‌లో ఇటీవల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు 10వ తరగతి నమూనా, ప్రజ్ఞా వికాసం పరీక్షలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సుహానా, శ్యాంసుందర్‌గౌడ్, నాని, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తశ్రీన్, సౌజన్య, అభి, వర్షిత, సురేఖ, వజీర్, ఆసిఫ్, అభివర్షిత, హర్షితలకు బహుమతులు ప్రదానం గావించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుంకన్న, న్యాయవాది రమేష్, కెఎస్‌కే స్కూల్ అధినేత సునీల్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి నవీన్‌యాదవ్, గోవర్ధన్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి అబాకస్ పోటీలలో సత్తా చాటిన గ్రామీణ విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న విశ్వం టెక్ సంస్థ ప్రతినిధులు

వజ్రకరూరు మార్చి 8 ప్రభాతవార్త

జాతీయస్థాయి పోటీలలో భాగంగా ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ కూకట్పల్లి లో జరిగిన పోటీలలో మండలంలోని గంజికుంట శ్రీసాహితీ విజ్ఞాన్ పాఠశాలకు చెందిన సాయి ప్రహర్షిత ప్రతిభను చాటి రెండవ ర్యాంకును సాధించింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులతో పోటీపడి జాతీయస్థాయిలో ప్రతిభను చారడం గంజికుంట గ్రామానికి కాకుండా అనంతపురం జిల్లాకే గర్వకారణమని గ్రామస్తులు కొనియాడారు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలో విద్యనుభ్యసించే విద్యార్థులు, పాఠశాలలు పట్ల కార్పొరేట్ స్థాయి పాఠశాలకు చాలా వ్యత్యాసం ఉంటుంది ఆ స్థాయి విద్యార్థులతో పోటీపడటం అభినందనీయమని, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు రామాంజనేయులు పాత్ర కూడా ప్రశంసనీయమని స్థానికులు తెలిపారు. విద్యార్థిని పాఠశాల యజమాన్యం వేణుగోపాల్ ప్రకాష్ ,జాకీర్ లు అభినందించారు. విశ్వం టెక్ సంస్థ ప్రతినిధులు 2000 రూపాయలను, జ్ఞాపికను సాయి ప్రహర్షిత కు అందజేశారు.

## ఊపందుకొంటున్న సేవ్ ఆర్డీటీ ఉద్యమం..!

-నేడు ఉరవకొండలో అఖిల పక్షంలో ఆధ్వర్యంలో భారీ ధర్నా

-నేతృత్వం వహిస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

-మద్దతునిస్తున్న కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ప్రజా, విద్యార్థి సంఘాలు

ఉరవకొండ, మార్చి 8 ప్రభాతవార్త



ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఆర్డీటీ సంస్థను పరిరక్షించాలని, సంస్థ సేవలు నిలిచిపోకుండా విదేశీ విరాళాలు సమకూర్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని కోరుతూ సేవ్ ఆర్డీటీ పేరుతో ఉద్యమం మరోమారు జిల్లాలో ఊపందుకొంటోంది. ఈనెల 9వ తేదీన ఉరవకొండ పట్టణంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తుండగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి నేతృత్వం వహిస్తున్నారు. ధర్నాకు ఇప్పటికే కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీలతోపాటు పలు ప్రజా, విద్యార్థి సంఘాలు సంపూర్ణ మద్దతునిస్తూ ధర్నాలో పాల్గొంటామని ప్రకటించాయి. గత వారం పది రోజులుగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ధర్నా విషయమై విస్తృత ప్రచారం కొనసాగింది. ఆర్డీటీ సంస్థ కరువు పీడిత అనంతపురం జిల్లాలో గత 50 సంవత్సరాలుగా చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను జిల్లా రూపురేఖలు మారడానికి చేపట్టిన ప్రాజెక్టులు, మహిళలు, రైతులు, విద్యార్థులు, క్రీడాకారులకు ఇచ్చిన చేయూతను కేంద్రం గుర్తించి సంస్థ విదేశీ నిధులు సమకూర్చుకోవడానికి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలన్న డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది. నిధులు లేక ఆర్డీటీ సేవలు నిలిచిపోతున్నాయని సంస్థ శ్రీలంకకు తరలిపోతుందన్న ప్రచారం ఇటీవలి కాలంలో జరుగుతుండటంతో పేద, బడుగు, బలహీన వర్గాల్లో ఆందోళన నెలకొంది. సేవ్ ఆర్డీటీ ఉద్యమాన్ని తీవ్రతరం చేసి కేంద్రం సంస్థకు ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధ రించేలా ఒత్తిడి తీసుకురావడానికి మరోమారు ఉద్యమం ఉధృతం చేయాలని రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్‌సీపీ ముందుకు రావడం విశేషంగా చెప్పాలి.

## తుంగభద్ర హైలెవెల్ కెనాల్‌ను ప్రభుత్వం ఆధునికీకరించాలి

-విలేఖరులతో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.కేశవరెడ్డి



విలేఖరులతో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.కేశవరెడ్డి

ఉరవకొండ, మార్చి 8 ప్రభాతవార్త

తుంగభద్ర హైలెవెల్ కెనాల్‌ను (హెచ్ఎల్‌సీ) రాష్ట్ర ప్రభుత్వ ఆధునికీకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.కేశవరెడ్డి కోరారు. పట్టణంలోని ఐదుకల్లు సదాశివన్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన పార్టీ ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి ఎం.బి.చెన్నరాయుడు, రైతు సంఘం జిల్లా నాయకులు వరప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. బి.కేశవరెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లాకు తుంగభద్ర జలాశయం నుండి 32.5 టీఎంసీల నీళ్ల రావాల్సి ఉండగా హెచ్ఎల్‌సీ కాలువ శిథిలావస్థకు చేరుకోవడం, పూడిక పేరుకుపోవడం, లీకేజీలు, మరమ్మతుల లోపాల కారణంగా మన వాటా నీటిని మనం తెచ్చుకోలేకపోతున్నామన్నారు. హెచ్ఎల్‌సీ కాలువకు అనుబంధంగా ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాలువలు సైతం శిథిలావస్థలోనే ఉన్నాయని దీంతో ఆయకట్టుకు నీరు అందని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కర్నాటక నుండి అనంతపురం జిల్లా సరిహద్దు వరకు 4,000 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంటే 105 కిలో మీటరువద్ద కాలు శిథిలావస్థకు చేరుకోవడంలో 2,000 క్యూసెక్కుల నీరు కూడా రావడం లేదన్నారు. దీనివల్ల అనంతపురం జిల్లాకు కేవలం 24 టీఎంసీల నీరు మాత్రమే అందుతోందని, వస్తున్న నీటిలో 11 టీఎంసీలు తాగునీటి అవసరాలు కేటాయిస్తున్నారని తెలిపారు. హెచ్ఎల్‌సీ ద్వారా జిల్లాలో 2 లక్షల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా వస్తున్న అరకొర నీటితో 70వేల ఎకరాలకు కూడా సాగునీరు అందడంలేదని వాపోయారు. తాడిపత్రి ఆయకట్టుకు 31వేల ఎకరాలకు, ఆలూరు బ్రాంచి కెనాల్‌కు 14వేల ఎకరాలకు, గుంతకల్లు బ్రాంచి కెనాల్‌కు 16వేల ఎకరాలకు నీరు అందాల్సి ఉన్నప్పటికీ చివరి ఆయకట్టుకు నీరు అందక రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు 105 కిలో మీటరు నుంచి 189వ కిలోమీటరు వరకు హెచ్ఎల్‌సీ ఆధునికీకరణ చేయాలని పాదయాత్ర చేశారని అయితే అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా ఆధునికీకరణపై స్పందించడం వారు లేదన్నారు. ప్రభుత్వం హెచ్ఎల్‌సీ ఆధునికీకరణ విషయంలో స్పందించని పక్షంలో ఏప్రిల్ నుంచి సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికిగాను దశలవారిగా ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని బి.కేశవరెడ్డి వివరించారు.

## లత్తవరంలో లక్ష్మినరసింహస్వామి ఆలయానికి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

-ఈనెల 31, ఏప్రిల్ 1,2 తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఉరవకొండ, మార్చి 8 ప్రభాతవార్త



జేసీబీతో రోడ్డు పనులు చేపట్టిన మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప

మండల పరిధిలోని లత్తవరం గ్రామంలోని కొండపై వెలసిన లక్ష్మినరసింహస్వామి ఆలయానికి నూతన రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. గ్రామ మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప, కొర్రపాటి మల్లికార్జున ఆధ్వర్యంలో ఆలయం వరకు రోడ్డు ఏర్పాటులో భాగంగా కొండ గుట్టలను జేసీబీ సాయంతో చదును చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందప్ప మాట్లాడుతూ ఈనెల 31, ఏప్రిల్ 1,2 తేదీ వరకు ఆధునికీకరించిన ఆలయంలో స్వామి నూతన విగ్రహంతోపాటు నవగ్రహాలు తదితర దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన జరుగనుందన్నారు. ఈ క్రమంలోనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడటానికిగాను రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాల మేరకు రోడ్డు ఏర్పాటు పనులను చేపట్టడం జరిగిందని వివరించారు.

## ఘనంగా పాఠశాల వజ్రోత్సవ వేడుకలు



మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు మార్చి 8 ప్రభాతవార్త

మండలంలోని పిసిపి కొత్తకోట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వజ్రోత్సవ వేడుకలను పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వక్తలు ప్రసంగిస్తూ జ్ఞానాన్ని నేర్పిన పాఠశాల ఏదో ఒక రూపంలో సేవ చేసి రుణం తీర్చుకోవాలన్నారు. పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని కార్యక్రమానికి హాజరైన మహిళలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులను అందజేశారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు.

